# సంఘర్షణ

-టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

చాలాకాలం తరువాత గుడికి వెళ్లాను. దేవుడు నవ్వుతూ చూస్తున్నాడు నాకేసి. అది ఆశీర్వాదమో, పరిహాసమో ఓ పట్టానా అర్థం కాలేదు. ఆలయం ఎంత ప్రశాంతంగా ఉన్నా నా మనసులోని సంఘర్షణ మాత్రం తగ్గలేదు ఏ కాస్తా...

అందుకే అట్నుంచి అటే ఆనందాశ్రమానికి వెళ్లాను. అదృష్టవశాత్తు అంతగా జనం లేరు. నిత్యానందస్వామివారు కూడా నవ్వుతూనే చూశారు నాకేసి.

"అశాంతిని భరించలేక పోతున్నాను స్వామీ!" అన్నాను నిజాయితీగా. "నీవు కోరి మరీ కొని తెచ్చుకుంటున్నదే కదా నాయనా!" నవ్వుతూనే అన్నారాయన.

విద్యుద్ఘాతానికి గురైన వాడిలా విలవిలలాడాను. ఆయన సర్వాంతర్యామి అనిపించింది నాకా క్షణాలలో!

★★★

'అయినా ఆ ఆనందరావుకు నామీదే అంత అభిమానం ఎందుకుండాలి?' అనుకున్నాను.

ఆఫీసులో ఎవ్వరితో ఉండనంత కలివిడిగా, స్నేహంగా నాతోనే ఉండడం నా అదృష్టంగానే భావించాను. భావింపకేం చేస్తాను?... ఆనందరావు యూనియన్ లీడర్ అయినందువల్ల. అతని ఆప్త మిత్రుడిగా ఆఫీసులో నాకెంతో గౌరవం! పైగా ప్రతి సాయంకాలం కలసి కాస్త తీర్థం పుచ్చుకోవడానికి చాలా మంచి కంపెనీ ఆనందరావు.

అయితే అసలుసిసలు చిక్కంతా అనంతలక్ష్మిని చూసిన తరువాతే ఆరంభమైంది.

ఆనందరావు పెద్ద భార్య లలితాదేవీ, పిల్లలూ నాకు మొదట్నుంచీ తెలుసు. లెక్కలేనన్ని సార్లు వాళ్లింట్లో విందులకూ, వినోదాలకూ హాజరయ్యాను.

అతని రెండవ భార్య రాజ్యలక్ష్మి కూడా నాకు తెలుసు. చాలాసార్లు ఆవిడ ఇంటికి అతనితో కలసి వెళ్లడం జరిగింది.

ఎటొచ్చీ అతని మూడవ భార్యను చూడడమే జరగలేదు...తను జీవించి ఉండగా...!

★★★

"సార్...సార్...ఆనందరావుగారు అదోరకంగా ఉన్నారు.

మిమ్మల్ని అర్జెంటుగా రమ్మంటున్నారు!" అంటూ కంగారుగా వచ్చిన అటెండరు అన్నయ్య చెప్పింది వినగానే నేనే కాదు. నా కొలీగ్స్ అందరూ ఎక్కడి ఫైళ్లక్కడ వదిలేసి అకౌంట్స్ సెక్షన్ కేసి కదిలారు.

"ఊపిరి సరిగ్గా ఆడడం లేదు రాజారావ్! ఎట్లెట్లో ఉంది..." అన్నాడు... అంటూనే గబగబా టాయిలెట్‌కు వెళ్లివచ్చాడు ఆనందరావు.

"వీపులో మెడ క్రిందుగా బరువుగా నొప్పిగా ఉంది!" అన్నాడు రాగానే...అప్పటికే చెమటలు పడుతున్నాయి అతనికి.

ఆ కంగారులో మాకెవరికీ హార్ట్‌అటాక్ అయి ఉండవచ్చనే ఆలోచన రాలేదు. సరిగ్గా ఆ సమయానికే ఆఫీసు జీపు డ్రైవరు టీ తాగడగానికి ఎటో వెళ్లాడు.

మోటార్ బైక్ వెనుక కూర్చోలేనంటే ఆటో దొరికే వరకూ నడిపించుకునే వెళ్లాము. ఆటోలో వెళ్తున్నప్పుడు తను తల వాల్చేసినా అనుమానం రాలేదు.

హాస్పిటల్‌లో ఆనందరావును పరీక్షించగానే గబగబా గొంతు గుండా ప్లాస్టిక్ పైపు దించి మొదట నాచురల్‌గా, ఆ వెంటనే ఆర్టిఫిషియల్ కిస్ ఆఫ్ లైఫ్ అప్లయి చేసేస్తుంటే ఆశ్చర్యపోయాం అందరం.

"హి ఈజ్ నోమోర్! ఐ థింక్ ఇట్స్ ఎ కార్డియో రెస్పరేటరీ అరెస్ట్!" పది నిమిషాల తరువాత డాక్టర్ వేదవ్యాస్ చెప్పింది బుర్రలకెక్కి మొద్దుబారి పోవడానికి సమయం పట్టింది.

సదా నవ్వుతూ నవ్విస్తూ తిరిగే ఆనందరావు నిర్జీవంగా పడి ఉన్నాడు స్ట్రెచర్ మీద. అయితే అతని ముఖంలో జీవకళ మాత్రం అలాగే ఉంది అప్పటికి!!

★★★

అతని ఆకస్మిక మరణం నన్ను చాలా కృంగదీసింది. అతనితో కలసి గడిపిన ఆ అద్భుతమైన



సాయంకాలాలు మరచిపోవడం సాధ్యం కాని పనయింది. ఓ పట్టాన కోలుకోలేక పోయాను.

పదిహేను రోజుల సెలవు తరువాత నిరుత్సాహంగా వెళ్లి డ్యూటీకి రిపోర్టు చేశాను. ఆ రోజు సాయంకాలమే మొట్టమొదటిసారి అనంతలక్ష్మిని చూడడం.

"సార్ మీ కోసం ఎవరో అమ్మాయి వచ్చారు... బయట పోర్టికో దగ్గర ఉన్నారు!" అని అన్నయ్య చెప్పగానే "ఎవరా?" అనుకుంటూ ఆఫీసు వెలుపలికి వచ్చిన నేను ఆ అపురూప సౌందర్యరాశిని చూసి ఆశ్చర్యపోయాను. అయితే ఆ అందమైన కళ్ల వెలుగుల వెనుక ఏవో నీలి నీడలు కన్పిస్తున్నాయి.

ఆమె ఆనందరావు తాలూకు ముఖ్యమైన మూడవ స్త్రీ అని తెలిసి నిర్ఘాంతపోయాను. అంతులేని విషాదం ఏమిటంటే అతని మరణవార్త ఆమెకు వారం రోజుల తరువాత కానీ తెలియలేదట.

"మిమ్మల్ని నేనెప్పుడూ చూడకపోయినా మీరు వారి ముఖ్య స్నేహితులని వారి ద్వారా చాలా సార్లు విన్నాను. అందువల్ల మీరు సహాయం చేస్తారని వచ్చాను!" అందామె.

"చెప్పండి! ఏం చెయ్యాలి?" అన్నాను... మనసులో మాత్రం...

"ఆనందరావ్! నీవు చాలా దురదృష్టవంతుడివోయ్!" అనుకుంటూ.

"నేను పెద్దగా చదువుకోలేదు... పెద్ద దిక్కూ పెద్దగా లేనిదాన్ని...అదృష్టవశాత్తు ఆయన నా కోసం కొంత డబ్బు వేసి ఉంచారు... అది నాకు వచ్చే ఏర్పాటు చేయాలి!" అంది ఆమె కళ్ల నుంచీ జలజలా కన్నీటి చుక్కలు జారిపోతుండగా.

"ఆనందరావు మీ కోసం డబ్బు ఉంచాడని మీరెలా చెప్పగలరు?"

"బాంకు బుక్ ఉంది!" అందామె.

"ఇలా ఇవ్వండి చూస్తాను!" అన్నాను ఆసక్తిగా.

"ఇంట్లో ఉంది... తీసుకు రాలేదు!" అందామె నెమ్మదిగా.

"సరే ఇల్లెక్కడ?" అని ప్రశ్నించాను.

ఆమె వివరంగా చెప్పాక..."మీరు వెళ్లండి...రేపు సెలవే... ఉదయాన్నే నేనే వచ్చి చూస్తాను!" అన్నాను.

ఆ రాత్రి ఓ పట్టానా నిద్ర పట్టలేదు... కుందనపు బొమ్మలాంటి ఆమె రూపమే పదే పదే కళ్ల ముందు మెదులుతోండగా మధ్యమధ్య ఆనందరావు నవ్వు ముఖం నన్ను వెక్కిరిస్తూ మనసులో మెదుల్తూ... మరుగుకు వెళ్తూ ఉంది.

సంఘర్షణకు ఆ రాత్రే నాంది!!

మరునాటి ఉదయాన్నే మోటార్ సైకిలు మీద ఐదు కిలోమీటర్ల అవతలున్న ఆమె ఇంటికి బయల్దేరి వెళ్లాను.

చిన్న కాంపౌండ్‌తో చిన్న ఇల్లు... కానయితే ముచ్చటగా ఉంది... అసాధ్యుడు ఆనందరావు... ఊరి కొసన ఆమె కోసం ఆ ఇంటిని తనే నిర్మించి ఇచ్చాడట.


అజంతా శిల్పం లాంటి ఆమె అందంగా అటూ ఇటూ తిరుగుతూంటే ఆనందరావుమరణం తాలూకు విషాధం నా గుండెల్లో నిలవడం లేదు... చూపులు మరలడం లేదు.

"ఓరి పాపీ!...పశువా!!" అని నన్ను నేనే తిట్టుకుంటూ ఆమె అందించిన పాస్‌బుక్‌ను పరిశీలించాను.

ముప్ఫై ఎనిమిదివేల రూపాయల నిల్వ ఉన్న పాస్‌బుక్ ఆనందరావు పేరిటే ఉంది...

అదృష్టవశాత్తు నామినేషన్ "సిస్టర్-ఇన్-లా"గా ఆమె పేరిట ఉన్నవైనాన్ని తెలిపే కాగితాలు కూడా ఆ పాస్‌బుక్‌లోనే ప్లాస్టిక్ అట్టలో చెక్కబడి ఉన్నాయి.





## ఆదర్శం

అందాల తార టాబూ 'హవా' చిత్రంపై వచ్చిన విమర్శల్ని పట్టించుకోవడంలేదు. అంతేకాదు ఆమె తనపై వచ్చే విమర్శలకి అసలు జవాబులు కూడా ఇవ్వడంలేదు. ఈ విషయంలో సీనియర్ తారలే తనకి ఆదర్శం అన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఇప్పుడామె తన కెరీర్ గురించే ఆలోచిస్తోంది. గౌతమ్ ఘోష్ కొత్త చిత్రం అబర్ అరణ్యే వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్‌కి వెళ్లినందుకు ఆనందంగా ఉందంటోంది. హవా తన కెరీర్‌కి కొంచెం దోహదపడినా తన ఆకాంక్షలేమిటో దాని ద్వారా వ్యక్తమయ్యాయంటోంది. 'ఏ చిత్రాల్లో ఎలా నటించాలో నాకు తెలుసు. అభిమానులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకుంటాను. నా కెరీర్‌ని చూసి ఓర్వలేనివారే నాపై విమర్శలు చేస్తుంటారు. వాటి గురించి పట్టించుకుంటూ కూర్చుంటే ముందుకి సాగలేం' అంటోంది టాబూ. ఆమెలా అందరూ ఉండలేరు కదా.




"మూడు నాలుగు రోజుల్లో కార్పొరేషన్ ఆఫీసు నుండీ డెత్ సర్టిఫికెట్స్ తెచ్చి పెడ్తాను. ఇంకా అవసరం అయితే నా ఫ్రెండ్ ఒకతను నోటరీగా ఉన్నాడు... అతని వద్ద అఫిడవిట్ తెస్తాను. ఈ డబ్బు డ్రా చేసి మీ పేరిట డిపాజిట్ చేసుకోవచ్చు!" అని ధైర్యం చెప్పాను.

ఆమెకు ఆ డబ్బు అందడంలో నాకేం అనౌచిత్యం కన్పించలేదు.

పెద్ద భార్యకు పెన్షనూ, బెనిఫిట్లూ అందుతాయి.

రెండవ భార్య వెల్ సెటిల్డ్... బాగా డబ్బూ, పొలాలూ కలిగి ఉన్న స్త్రీ! ఎటొచ్చీ ఈమె...

ఆమె కాఫీ తీసుకురావడానికి వంటగదికి వెళ్లింది. ఆనందరావు ఆనందంగా, సజీవంగా సంచరించిన ఆ గృహంలో కాఫీ తాగడానికి కూడా నా మనసు ఇష్టపడలేదు.

కానీ...శోకదేవతలా కదులుతున్న ఆమె కదలి కల్ని కన్నుల పండువగా కళ్లతో జుర్రుకోవడానికి మాత్రం అడ్డుపడలేదు... ఓ మూలుగు మూలిగి ఊరుకుంది... అంతే!!

***

నేను కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆ మరునాడే లలితాదేవి తమ కుమార్తెతో పాటు ఆఫీసుకే వచ్చి డెత్ సర్టిఫికెట్ కాపీలు, లీగల్ హైర్ సర్టిఫికెట్, ఫామిలీ మెంబర్ సర్టిఫికెట్ మొదలైనవన్నీ అందజేసింది నాకు.

ఆమె కళ్లలో దుఃఖం కనిపించడం లేదప్పుడే! నిరాశతో నిండిన నిర్లిప్తత లాంటి భావం ఏదో కన్పిస్తోందంతే!

పాప కళ్లలో మాత్రం తండ్రిని కోల్పోయిన దిగులు కొట్టొచ్చినట్టు కన్పిస్తూ నా కంట తడి తెప్పించింది!!

"ధైర్యం తెచ్చుకోండమ్మా!" అన్నాను నేను దిగులుగా.

"ధైర్యం తెచ్చుకోక తప్పదన్నా... పిల్లలకింకా పూర్తిగా రెక్కలు రాలేదు కదా?... వారయితే ఇంటి పట్టున సరిగ్గా ఉండేవారే కాదు. మొదట్నుండీ... అందుకే వార్ని మృత్యువు గద్ద తన్నుకు పోయినట్లు తీసుకుపోయినా తట్టుకోగలుగుతున్నాం!" అంది ఆమె కన్నీరు కారుస్తూ. తల్లి దుఃఖం చూసి పాప కూడా ఏడ్వడం మొదలు పెట్టింది.

కాస్త హెచ్చు తక్కువగా నా పరిస్థితీ అంతే!

నా కొలీగ్స్ అందరూ ధైర్యం చెప్పడంతో ఆమె కొంత తేరుకుంది.

అందరం కలిసి ఆమెనూ, పాపనూ జాయింట్ డైరెక్టర్ చాంబర్స్‌లోకి తీసుకు వెళ్లి పరిస్థితి వివరించాము.

జాబ్ ప్రపోజల్ ఫర్ అన్‌మారీడ్ డాటర్, పెన్షన్ ప్రపోజల్స్ ఆంటిసిపేటరీ పెన్షన్ ప్రపోజలు, లీవ్ అకౌంటు క్లెయిం, పి.ఎఫ్. రీఫండ్ మొదలైన వాటన్నింటికీ వెంటనే ఏర్పాట్లు చేయమని మమ్మల్ని పురమాయిస్తూ తల్లీబిడ్డలకు నాలుగు ఊరడింపు మాటలు చెప్పాడాయన.

అన్నింటికీ అప్లికేషన్లు టైప్ చేయించి లలితాదేవి వద్ద సంతకాలు తీసుకుని వారిని ఆఫీసు జీపులోనే ఇంటికి పంపిచేశాక అంత విషాదంలోనూ నేనో డెత్ సర్టిఫికెట్ కాపీ తీసుకుని మడిచి జేబులో ఉంచుకోగలిగాను.

ఆ మరునాడు సెలవు పెట్టి అనంతలక్ష్మిని బాంకుకు తీసుకువెళ్లి డెత్ సర్టిఫికెట్‌తో విత్‌డ్రాయల్‌కు అప్లయి చేయించాను.

ఆనందరావు డబ్బు డ్రా చేయడానికి దాదాపు నాలుగు రోజులు పట్టింది.

ఆలోగా ఆమె తాళిబొట్టు తాలూకు బంగారు నానుతాడు, మరికొంత వెండి, బంగారాలూ అమ్మివేయడానికి ఆమెతో పాటు తోడుగా రెండుసార్లు బజార్లు తిరగాల్సి వచ్చింది. ఆమె దగ్గరున్న డబ్బు, బాంకు నుండి డ్రా చేసిన డబ్బు, వెండి, బంగారాలు అమ్మిన డబ్బు అన్నీ చేర్చి కాస్త పెద్ద మొత్తమే ఆమె పేరిట డిపాజిట్ చేయించి ప్రతి నెలా వడ్డీ డ్రా చేసుకునే ఏర్పాటు చేసి వెనుతిరిగాను.

ఆ క్షణం నుండీ నాలో అధికమైంది అంతులేని సంఘర్షణ.

వెళ్లకూడదనుకుంటూనే రెండుసార్లు వెళ్లాను ఆమెను చూడడానికి. మూడవ పర్యాయం తనే వచ్చింది ఓ రోజు ఆఫీసు వద్దకు.

"ఇంటిమీద కుదురుగా రెండు గదులు వేసుకుని అందులో నేనుండిపోతే కింద ఇంటికి నాలుగు డబ్బులు అద్దె రూపేణా అందుతాయి కదా?" అన్నది ఆమె. చాలా మంచి ఆలోచన అనిపించింది.

ఆ పని కోసం లైసెన్సుడు సర్వేయర్ చుట్టూ, టవున్‌ప్లానింగ్ డిపార్టుమెంట్ చుట్టూ పదిసార్లు తిరిగి ప్లాన్ అప్రూవ్ చేయించి ఇచ్చాను. తరువాత నాకు తెలిసిన తాపీమేస్త్రీని మాట్లాడి కుదిరించడం, మెటీరియల్స్ సప్లయి చేయించడం...ఇలా...దాదాపు నాలుగు నెలల పాటు తరచూ కలవాల్సి వచ్చింది తనని.

కృతజ్ఞతలు నిండిన కళ్లతో చూస్తూ ఆమె

కాఫీనో, జ్యూసో అందించేప్పుడు పొరపాటున ఆమె చేతి వ్రేళ్లు తగిలినా పులకరింతలు కలిగేవి. నా ఆప్తమిత్రుడు ఆనందరావు ఆత్మీయంగా స్పర్శించిన చేతులే తోచేది కానీ నా భార్యా పిల్లలూ ఆ సమయంలో అస్సలు మనసులో మెదిలేవారు కారు.

అనుకున్న దానికన్నా పెద్దగానే నిర్మాణ కార్యక్రమం పూర్తయింది. అనంతలక్ష్మి పై పోర్షన్ చేరింది. కింది ఇంట్లో ఓ చిరుద్యోగి భార్య, ఇద్దరు పిల్లలతో చేరాడు.

ఇహ శాశ్వతంగా సెలవు తీసుకోవడం మంచిదనుకున్న రోజున ఆమె మరింత మనోహరంగా కనిపించింది.

తమకంగా తన చేతిని నా చేతుల్లోకి తీసుకోకుండా ఉండలేకపోయాను...

"ఆయన పోయి ఆర్నెల్లయినా పూర్తి కాలేదు కదా?'' అందామె.

అభ్యంతరం వాక్కులోనే తప్ప ఆమె కళ్లలో కన్పించక పోయినా అప్రయత్నంగా ఆమె చెయ్యి వదిలేశాను... మనసదోలా అయిపోవడం వల్ల...దిగులుగా...!

"రాజారావ్! నీవు మరీ దుర్మార్గుడివోయ్!'' అంటూ ఆనందరావు పక్కనే నిలబడి నవ్వుతున్నట్లుగా అనిపించింది ఆ క్షణాలలో.

తరువాత నేను వెళ్లకపోయినా తనే మూడు సార్లు వచ్చి నన్ను కలిసి మాట్లాడి వెళ్లడంతో ఇహ నన్ను నేను నిగ్రహించుకోవడం కష్టం అయిపోసాగింది!

అయితే ఆనందరావు జ్ఞాపకాలు రెట్టింపు వేగంతో ఎగిసిపడ్తూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

వెనక్కూ ముందుకూ ఊగిసలాడే మనసులో రేగుతున్న అశాంతి అత్యధికం అయిపోయి భరించలేని స్థితికి చేరుకుంది.

***

"అయినా ఆ ఆనందరావు అంత అర్ధాంతరంగా ఎందుకు వెళ్లిపోవాలి స్వామీ?'' అని ప్రశ్నించాను అసంకల్పితంగా.

"ప్రతి మనిషికీ గాలీ, నీరూ, ఆహారమూ, ఆనందమూ...అన్నీ కూడా అందజేయబడినంత వరకే అందుబాటులో ఉంటాయి. ముగించుకున్న వారికిక్కడ శూన్యమే కద నాయనా?'' అన్నారు నిత్యానంద స్వామి.

వారి జవాబులో కొన్ని వందల సమాధానాలున్నాయి.

"నా మాటేమిటి స్వామీ?'' అన్నాను దీనంగా.

"మార్గం కన్పించబోతోంది... ఆ దారిన వెళ్లడమే శ్రేయస్కరం నాయనా!'' నవ్వుతూనే అన్నారాయన.

***

అనుకోకుండా హఠాత్తుగా నాలుగు వందల మైళ్లకవతలి కుప్పానికి బదిలీ అయింది నాకు పదోన్నతితో!

ప్రయత్నిస్తే దగ్గరి దాపులలోకే తెచ్చుకోవచ్చు!!

కానీ...?...!!...

దూరప్రాంతమైనా ఆ ఊర్లో మంచి అభివృద్ధి జరుగుతోందని వినివున్నాను. విద్యా, వైద్య సదుపాయాలూ బాగా విస్తరింపబడుతున్నాయని తెలుసు.

వెళ్లి జాయిన్ అయిపోయి మంచి ఇల్లు చూసుకుని వచ్చి కుటుంబాన్ని తీసుకు వెళ్లడమే మంచిది. కానీ...

నా ఆలోచనలలో నేను నలుగుతుండగానే నన్ను రిలీవ్ చేయడం, సెండాఫ్ పార్టీ ఇవ్వడం కూడా జరిగిపోయాయి.

ఓ రోజు అన్యమనస్కంగానే సూట్‌కేస్ సర్దుకుని బయల్దేరాను.

ఆటో కోసం వీధి చివరకు వచ్చాక...మళ్లీ సంఘర్షణ...!... అంది వచ్చిన స్వర్గసుఖాలను కాలదన్ని వెళ్లిపోతున్నానేమోనన్న ఆలోచన...నేను పొందాల్సిన స్థానాన్ని మరెవరో కాజేస్తారు కాబోలు ననే బాధ... నన్ను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

కారణం చెప్పరాని దిగులు...దాంతో గుండె బరువు!!

కుడివైపు వెళ్తే...నడచి వెళ్లినా సకాలంలో స్టేషను చేరుకుని రైలెక్కవచ్చు...

ఎడం వైపు వెళ్తే... ఏదైనా ఆటో పట్టుకుని అనంతలక్ష్మి ఇంటికి వెళ్ల వచ్చు...

నా కళ్ల ముందు మనోహరమైన ఆమె రూపం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ కన్పిస్తోంది!

"మార్గం కన్పించబోతోంది... ఆ దారిన వెళ్లడమే శ్రేయస్కరం నాయనా!''.. అంటూ నిత్యానందస్వామి వారి స్వరం చెవుల్లో విన్పిస్తోంది!!

నా మనోఫలకం మీద ఆనందరావు నవ్వుతున్నాడు!

నేనలా ఆ రోడ్డు మధ్యనే నిలబడిపోయాను....

★

## వైరస్ తెచ్చిన తంటా

మొన్నామధ్య వరకూ వైరస్ తెచ్చిన తంటా అంతా ఇంతా కాదు. వైరస్ దెబ్బతో విమానసర్వీసులు చాలా దెబ్బతిన్నాయి. వైరస్ ఇచ్చిన ఈ షాక్ అందర్నీ కలవరపరిచింది. ఇదిలా ఉంటే ఇప్పుడు విదేశాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ పెరుగుతోంది. ముఖ్యంగా విమానాశ్రయాలకి వచ్చిపోయే పదిమందిలో ఒకరు ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారుట. అమెరికన్ సొసైటీ ఆఫ్ మైక్రోబయాలజీ ఈ వివరాలు అందజేసింది. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోకపోతే ఎలర్జీని కలిగించే క్రిములు విజృంభిస్తాయని యూనివర్శిటీ ఆఫ్ యుటాకి చెందిన ప్రొఫెసర్ జూడీ ఎ. డాలీ అంటున్నారు. దీంతో అమెరికాలోని ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో బాత్‌రూంలు ఖాళీ ఉండడంలేదట. వైరసా మజాకా!

## క్యాన్సర్ ట్రీట్‌మెంట్

క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లు ఈమధ్యకాలంలో బాగా జరుగుతున్నాయి. లంగ్ క్యాన్సర్‌తో బాధపడేవారు కొన్ని మెలకువలు పాటించాలని డాక్టర్లు చెబుతున్నారు. నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ (ఎన్ఎస్‌సిఎల్‌సి)తో బాదపడుతూ దానికి ట్రీట్‌మెంట్‌తో పాటూ కీమోథెరపీ కూడా తీసుకోవాలని స్వీడన్ వైద్యశాస్త్రవేత్తలంటున్నారు. ఈమేరకు వారు యూరోపియన్ క్యాన్సర్స్ కాన్ఫరెన్స్‌లో ఓ పరిశోధనా పత్రాన్ని కూడా సమర్పించారు. స్వీడన్‌లోని సహాల్‌గ్రెన్స్కా యూనివర్శిటీ శాస్త్రవేత్తల బృందం లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 1867 మందిపై పరిశోధన చేసి ఈ విషయాన్ని వెల్లడిచేసింది.

-శ్రీనివాస్

